క్లుప్తంగా

91 శాతం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నమోదు



పోలింగ్ మెటీరియల్‌ను పరిశీలిస్తున్న ఆర్వో విష్ణుచరణ్

సాలూరు: నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కొనసాగుతోంది. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రంలో మంగళవారం 209 మంది ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 1444 మంది పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోగా.. ఇప్పటివరకు 1316 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 91 శాతం ఓటింగ్ నమోదైనట్టు అధికారులు తెలిపారు. పోలింగ్ సరళిని ఐటీడీఏ పీఓ, సాలూరు అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి విష్ణుచరణ్ పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు సిద్ధం చేస్తున్న మెటీరియల్‌ను తనిఖీ చేశారు.

హోం ఓటింగ్‌లో 60 ఓట్లు పోలింగ్



పెదపెంకిలో హోం ఓటింగ్ నిర్వహిస్తున్న అధికారులు

బలిజిపేట: హోం ఓటింగ్‌లో 60 ఓట్లు పోలయినట్లు మండల నోడల్ అధికారి రమేష్‌నాయుడు తెలిపారు. ఓటుహక్కు కలిగి 85ఏళ్లు పైబడిన వృద్ధులు, 80శాతం పైగా దివ్యాంగత్వం కలిగిన వారు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నడవలేని వారంతా ఇంటివద్దే ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. ఈసీ నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా అధికారులు ఓటర్ల ఇంటి వద్దకు వెళ్లి పోలింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. మండలంలో 61మంది హోం ఓటింగ్‌కు అర్హులుగా గుర్తించారు. వారిలో 60 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఒకరు అందుబాటులో లేకపోవడంతో ఓటింగ్‌కు దూరమయ్యారని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పెదపెంకి సెక్టార్ అధికారి సామల సింహాచలం, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

వంగర: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని వివేక్ మాస్టర్ మైండ్స్ స్కూల్ ప్రిన్సిపాల్ బెవర ఈశ్వరరావు అన్నారు. పాఠశాల ఆవరణలో మంగళవారం మొక్కలు నాటిన ఆయన.. ఏటా వేసవిలో ఉష్ణోగ్రతలు పెరగడానికి కారణం అడవుల శాతం తగ్గిపోవడమేనన్నారు. ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి, సంరక్షించాలని కోరారు.

సీఎం జగన్‌తోనే జనరంజక పాలన

- ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు
- మీకు మేలు చేసిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి
- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జోగారావు



పార్వతీపురంటౌన్: చినమరికి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు, పక్కన ఎమ్మెల్సీ రవిబాబు

బలిజిపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాటు జనరంజక పాలన అందించారని, అభివృద్ధి, సంక్షేమం, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ.. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు అన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మరోసారి జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. మండలంలోని పెద్దింపేట, పోలినాయుడువలస, గౌరీపురం, నారాయణపురం, బలిజిపేట, వలగర గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయన్నారు. ఆయన్ను ఎదుర్కోలేక లేనిపోని ఆరోపణలు, తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగాలు కల్పించారు. గత ప్రభుత్వంలో భర్తీ చేయని ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారు. వైద్య, ఆరోగ్య శాఖలో వేల సంఖ్యలో ఖాళీలను భర్తీ చేశారు. అవన్నీ ఉద్యోగాలు కావా అని ప్రతిపక్షాలను ప్రశ్నించారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను పట్టించుకోవద్దని, మీకు మేలు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ జయప్రకాష్, ఎంపీటీసీ సాంభమూర్తి, ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, ఎంపీపీ నాగమణి, పార్టీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, రాష్ట్ర మహిళా సంఘం మాజీ మెంబర్ కె.శ్రీవాణి, జేసీఎస్ కన్వీనర్ శ్రీరాములునాయుడు, ఎం.వేణుగోపాలనాయుడు, ఎ.ప్రకాష్‌రావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మరో అవకాశం ఇవ్వండి

పార్వతీపురంటౌన్: ప్రజలందరికీ మేలు చేసిన జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. మండలంలోని సంగంవలస పంచాయతీ చొక్కాపువానివలస, పిట్లవలస గ్రామాలలో మంగళవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభించింది. పూలమాలలు వేసి, హారతులు ఇచ్చి ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసిన ఏకైక నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మీరంతా మనసారా దీవించి మరోసారి ముఖ్యమంత్రిగా అవకాశం కల్పించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా తనూజా రాణిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, ఎంపీపీ ప్రతినిధి మజ్జి శేఖర్, స్థానిక సర్పంచ్ బడే శ్రీరంజన్, మాజీ సర్పంచ్ గంట రామకృష్ణ, ఎంపీటీసీ బడే రామారావు, పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



పార్వతీపురంటౌన్: చొక్కాపువానివలసలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జోగారావు ఎన్నికల ప్రచారం



బలిజిపేట: పెద్దింపేటలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జోగారావు, ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన

ఫ్యాన్ ప్రభంజనం సృష్టించడం ఖాయం

పార్వతీపురంటౌన్: రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ ప్రభంజనం సృష్టిస్తుందని ఎమ్మెల్యే జోగారావు, అరుకు పార్లమెంట్ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కుంబా రవిబాబు అన్నారు. మండలంలోని మరిక పంచాయతీ పరిధి చినమరికి, పెదమరికి, కొత్తఊరు గిరిజన గ్రామాలలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఐదేళ్లలో అందించిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధిని వివరించారు. మనందరి జీవితాల్లో వెలుగులు నింపిన జగనన్నకు మనమంతా మద్దతుగా ఉందామని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గంగ, సచివాలయ కన్వీనర్లు గవర రమేష్, బొడపల్లి త్రినాథ, రాగాల సోమశేఖర్, బి.దుర్గారావు, పకీరు నాయుడు, సంఘం, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీకి ఓటేస్తే మళ్లీ కష్టాలే..



పెదగైశీలలో రాజన్నదొరకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

- అధికారంలో ఉన్నప్పుడు గిరిజనులకు ఏం చేశారో టీడీపీ నాయకులు చెప్పాలి
- టీడీపీ మాయ మాటలు నమ్మి మోసపోవద్దు
- మక్కువ మండలంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాజన్నదొర ప్రచారం



గైశీలలో ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న రాజన్నదొర



బట్టివలసలో ఎన్నికల ప్రచార ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొర

మక్కువ: తెలుగుదేశం పార్టీకి ఓటు వేస్తే, గతంలో పడిన ఇబ్బందులే, మళ్లీ పునరావృతమవుతాయని డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని మార్కొండపుట్టి, నంద, కవిరిపల్లి, ఎ.వెంకంపేట, కన్నంపేట, శంబర పంచాయతీల పరిధిలోని బట్టివలస, కాకుమానివలస, పెదగైశీల, కేంద్రుకగైశీల, పాతగైశీల, ఎస్‌కే గైశీల, నంద, నండబొడ్డవలస, పెద ఊటగెడ్డ, అడ్డుమండ గ్రామాలలో మంగళవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు రాజన్నదొరకు ఘనస్వాగతం పలికారు. ఆయనతో పాటు ఇంటింటి ప్రచారంలో పాల్గొని జై జగన్, జై రాజన్నదొర అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ.. ఎన్నికలు రావడంతో టీడీపీ నాయకులు మీ గ్రామాలకు వచ్చి కల్లబొల్లి మాటలు చెబుతున్నారని, వారి మాటలు వింటే గతంలో వలే, మళ్లీ కష్టాలు పడాల్సి వస్తుందన్నారు. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వంలో గిరిజన గ్రామాల్లో ఏం అభివృద్ధి చేశారో సమాధానం చెప్పాలన్నారు. ఇప్పుడు గ్రామాల్లోకి వచ్చి, లేనిపోని మాయమాటలు చెప్పి, ప్రజలను మరోసారి మోసం చేసేందుకు సిద్ధమయ్యారని ఎద్దేవా చేశారు. టీడీపీ అభ్యర్థి సంధ్యారాణి ఆరేళ్లు ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో మక్కువ మండలంలో ఏమైనా అభివృద్ధి చేశారా? మీరే ఆలోచనచేయాలని ఓటర్లను కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించడంతో పాటు, గ్రామాలను అభివృద్ధి చేశారన్నారు. గిరిజన విద్యార్థులు విదేశీ చదువుల కోసం ప్రభుత్వం రూ.1.25 కోట్లు ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. వలంటీర్ వ్యవస్థను కించపరిచిన చంద్రబాబు, మరలా వలంటీర్లకు రూ.10 వేలు వేతనం అందిస్తానని మాయ మాటలు చెపుతున్నారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో వలంటీర్ల సేవలు ప్రజలకు అందకుండా అడ్డుకోవడంతో పింఛన్లు సకాలంలో అందక లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారని, ఈ పాపం చంద్రబాబుదే అని అన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా తనూజారాణిని అత్యధిక మెజార్టీతో గెలిపించి, జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, సర్పంచ్ బిడ్డిక రమేష్, ఎంపీటీసీ మండంగి భాగ్యలక్ష్మి, ఉపసర్పంచ్ నిమ్మక మల్లేష్, నాయకులు తేలు శ్రీరాములునాయుడు, వేమూరి కోటేశ్వరరావు, జమ్ము సింహాచలం, బొత్స అప్పలనాయుడు, వెంపడాపు శ్రీనివాసరావు, తాడ్డి శ్రీనివాసరావు, శ్రీహరినాయుడు, నారాయణరావు, మధు, శ్రీధర్, కిశోర్, సంజీవునాయుడు, దాలినాయుడు, లక్ష్మణరావు, ప్రసాదు, అప్పలనాయుడు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఆదర్శం శివరాంపురం

- చిన్న గ్రామంలో పెద్ద అభివృద్ధి
- ఇంటింటికీ సంక్షేమ ఫలాలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



'నాడు-నేడు'తో రూపురేఖలు మారిన పాఠశాల



ఇంటింటికీ వేసిన తాగునీటి కుళాయిలు



పణుకువలస రోడ్డు జంక్షన్ నుంచి శివరాంపురానికి నిర్మించిన బీటీరోడ్డు

బలిజిపేట: జనాభాలో చిన్న గ్రామమే అయినా అభివృద్ధి, సంక్షేమంలో మేజర్ పంచాయతీలకు ఆదర్శంగా నిలుస్తోంది మండలంలోని శివరాంపురం. గ్రామంలో 210 కుటుంబాలు ఉండగా.. అందులో 208 కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయి. మిగిలిన రెండు కుటుంబాలలో ఒకరు ప్రభుత్వ ఉద్యోగస్తులు కాగా, మరొకరు అనర్హులుగా గుర్తించడంతో వారికి పథకాలు అందలేదు. అలాగే గ్రామంలో సుమారు రూ.3.06 కోట్లతో గ్రామానికి బీటీరోడ్డు నిర్మాణంతో పాటు గ్రామంలోని వీధుల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు, ఇంటింటి తాగునీటి కుళాయిలు, పాఠశాల ఆధునికీకరణ, తదితర అభివృద్ధి పనులు చేపట్టారు. గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధిని ఈ ఐదేళ్లలో చూశామని గ్రామస్తులు అంటున్నారు.

క్రమం తప్పకుండా పథకాలు వచ్చాయి



ఈ ప్రభుత్వంలో చెప్పిన విధంగా క్రమం తప్పకుండా పథకాలు అమలయ్యాయి. నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే సంక్షేమ పథకాల నిధులు జమ చేశారు. వలంటీర్లతోనే పథకాలు అమలు చేయడంతో ఎవరికీ లంచాలు ఇవ్వలేదు. ఈ ప్రభుత్వంతో మాకు ఎంతో మేలు జరిగింది.

– సావిత్రి, శివరాంపురం, బలిజిపేట మండలం

పేదలకు ఎంతో మేలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలతో పేదలకు మేలు జరిగింది. నేరుగా వారి ఖాతాల్లో సంక్షేమ పథకాల నిధులు పడుతున్నాయి. గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించడంతో మా గ్రామాన్ని అభివృద్ధి చేసుకునేందుకు మాకు అవకాశం లభించింది.

– ఆర్.శ్రీనివాసరావు, సర్పంచ్, శివరాంపురం, బలిజిపేట మండలం

గతంలో ఇన్ని పథకాలు లేవు



ఈ ప్రభుత్వంలో ఇచ్చినట్టు గతంలో ఏ ప్రభుత్వం ఇన్ని పథకాలు అమలు చేయలేదు. అప్పట్లో సంక్షేమ పథకాలు అంటే ఎంటో కూడా మాకు తెలీదు. ఇంట్లో ఎంత మంది అర్హులు ఉంటే అందరికీ పథకాలు అందాయి. పథకాల కోసం ఎవరి వద్దకూ వెళ్లాల్సిన అవసరం లేకుండానే వలంటీర్ల ద్వారా అందిస్తున్నారు.

– పోరమ్మ, శివరాంపురం, బలిజిపేట మండలం

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి



సాలూరు: పెదపదం పంచాయతీలో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు రెడ్డి పద్మావతి, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, తదితరులు

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తేదీ దగ్గర పడుతుండడంతో రాజకీయ పార్టీల నాయకులు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారాలు చేస్తున్నారు. పార్వతీపురం, సాలూరు నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వంలో జరిగిన సంక్షేమాన్ని, అభివృద్ధిని వివరించడంతో పాటు టీడీపీ మోసాలను ఎండగడుతున్నారు. మే 13 జరిగే పోలింగ్‌లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలను కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



సాలూరు: పట్టణంలో 16వ వార్డులో ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ రాపాక మాధవరావు



సీతానగరం: లక్ష్మీపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సాలూరు రూరల్: మామిడిపల్లి బక్కుపేటలో ఇంటింటి ప్రచారం చేస్తున్న మండల వైఎస్సార్‌సీపీ నాయకులు సువ్వాడ భరత్ శ్రీనివాస్, రామకృష్ణ



పాచిపెంట: కొటికిపెంటలో ప్రచారం చేస్తున్న నాయకులు సలాది అప్పలనాయుడు, ఇజ్జాడ అప్పలనాయుడు, తదితరులు



సీతానగరం: అప్పయ్యపేటలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జోగారావుకు మద్దతుగా ప్రచారం చేస్తున్న పార్టీ నాయకులు



సీతానగరం: దయానిధిపురంలో ఓటర్‌స్లిప్‌లు అందజేస్తున్న స్థానిక నాయకులు

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై కూటమి దుష్ప్రచారం

గరుగుబిల్లి: ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై టీడీపీ కూటమి నేతలు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని, వారి మాటల్లో ఏమాత్రం వాస్తవం లేదని జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు విమర్శించారు. ఇదే విషయమై విలేకరులతో మంగళవారం మాట్లాడిన ఆయన.. చట్టం ఇంకా అమలులోకి రాకముందే ప్రభుత్వం చట్టం అమలు చేసేస్తోందని, మీ భూములన్నీ లాక్కుంటారని టీడీపీ, జనసేన పార్టీల నాయకులు తప్పుడు ప్రచారం చేయడం ఏమాత్రం తగదన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో లబ్ధి పొందాలనే దురుద్దేశంతోనే ప్రభుత్వంపై విషప్రచారం మొదలుపెట్టాయని, అయితే వారిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. కేంద్రం అమలుచేయాలని చూస్తున్న ఈ చట్టం రాష్ట్రంలో ఇంకా అమలుకాలేదని, పరిశీలన దశలోనే ఉందన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



ఎన్నికల నిబంధనలు వివరిస్తున్న సీఐ మంగరాజు

గరుగుబిల్లి:

రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అందరూ సహకరించాలని చినమేరంగి సీఐ మంగరాజు కోరారు. మండల కేంద్రంలోని ప్రజలతో సోమవారం రాత్రి సమావేశమైన ఆయన.. ఎన్నికల నిబంధనలు, ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ నెల 13వ తేదీన జరిగే పోలింగ్‌లో అందరూ పాల్గొనాలని, ప్రతిఒక్కరూ నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా అనవసరమైన తగాదాలకు పాల్పడినా, ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే పరిమితికి మించి, డబ్బు, మద్యం తరలించవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ అమ్మనరావు తదితరులు పాల్గొన్నారు.